**Eenadu**

# విడతల వారీగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ

## ఏపీపీఎస్సీ ఛైర్మన్ ఉదయ్‌భాస్కర్

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను విడతల వారీగా భర్తీ చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ ప్రొఫెసర్ పి.ఉదయ్‌భాస్కర్ తెలిపారు. ఆదివారం ఆయన కుటుంబ సమేతంగా శ్రీశైలంలో పుష్కర స్నానం చేశారు. ఆ తర్వాత శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామివార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా 'ఈనాడు-ఈటీవీ'తో ప్రత్యేకంగా మాట్లాడారు. కృష్ణా పుష్కరాల సందర్భంగా ఏఈఈ పోస్టుల ప్రకటన విడుదలనిరుద్యోగులకు శుభవార్త అని అన్నారు. మొదట గ్రూప్-1 పోస్టుల భర్తీ తర్వాతనే గ్రూప్-2, 3లకు ప్రకటన ఇవ్వనున్నట్లు తెలిపారు. కేసుల కారణంగా గ్రూప్-1 పోస్టుల భర్తీకి కొంత సమయం పడుతుందన్నారు. ప్రభుత్వం ఆమోదం తెలిపిన 4,009 పోస్టులను విడతల వారీగా భర్తీ చేస్తామని, మిగిలిన వాటికి ప్రకటన ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగాల ఖాళీల వివరాలు, రోస్టర్‌పాయింట్ ప్రకారం ఖాళీల గుర్తింపు, జోనల్‌వారీ ఉద్యోగాల ఖాళీల వివరాలు ఇవ్వాలని కోరామన్నారు. సెప్టెంబర్ చివరిలోగా భర్తీ చేసే ఉద్యోగాలకు కూడా వయోపరిమితి పెంపును వర్తింపజేసే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.